


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**అడవి..శిథిలాలయం.**

"ఒక యాగాన్ని పూర్తి చేశాం. ఫలితం ఏమీ కనబడలేదు. అసలు ఎందుకు వచ్చిందో, ఎందుకు ముగిసిందో ఏమీ తెలీదు. దాదాపు రెండు నెలలకాలం వెతుకుతూనే ఉన్నాం. ఊసరవెల్లి రంగులు మార్చినట్టు ప్రకృతి తన కళలు మారుస్తోంది. ఈ రోజు ఉన్న బండరాయి రేపక్కడ దొరకదు. ఔషధమొక్కలు పిచ్చి మొక్కలూ ఒకేలా కనపడి మనసుని ఓ భ్రమలోకి నెడుతున్నాయి. "అయోమయంగా అన్నాడు నీలుడు. నీలుడు నిండుకుండలాంటివాడు. ఇంత విహ్వాలుడవటం ఏనాడూ మట్టు చూడలేదు.

"మనకి ఇచ్చిన కార్యాన్ని పూర్తి చేయడానికే మనం వున్నాము తప్ప ఫలం గురించి ఆలోచించడానికి కాదు నీలా. ఎవరైతే మనకీ కార్యాన్ని వప్పజెప్పారో అది వారి పని. ప్రకృతిని ఏనాడూ నిందించకు. ఎందుకంటే, ప్రకృతిని సంరక్షించాల్సిన మనిషే ప్రకృతిని ధ్వంసం చేస్తున్నాడు. విమర్శించే హక్కు మనిషికి ఎక్కడిదీ? ఇక భ్రమ సంగతి అంటావా? మనసు భ్రమలో లేనిదెప్పుడూ?" అనునయంగా అన్నాడు మట్టు. నీలుడు మాట్లాడలేదు. కావాల్సిన మొక్కల కోసం తీగల కోసం వాళ్ళు వెదుకుతునే వున్నారు. అడవిని గాలిస్తూనే వున్నారు. ఫలితం మాత్రం శూన్యం.

"మొన్నటివరకూ ఎక్కడ పడితే అక్కడుండేవి. ఆ వర్షం తరవాత ఎవరో మంత్రించినట్టు మాయమై పోతాయి. మరో విశ్వయజ్ఞం జరిగింది. నివృత్తి యాగం పూర్తికాలేదు. అందరూ ఎదురు చూస్తూనే వున్నారు. నిజం చెబితే ఖాళీగా కూర్చుని కూర్చునీ అలిసిపోయి వున్నారు. నివృత్తి యాగం పూర్తయితే తప్ప అరిదమనులవారూ, అలంబసులవారూ, సంకల్పానందగారు కదిలి వారి వారి స్వస్థానాలకు వెళ్ళడానికి వీల్లేదు. వారిని పంపించి గానీ మనం మన పనులు చేసుకోవడానికి వీల్లేదు. నీలా ఇటువంటప్పుడే సమ్యమనం కోల్పోకుండా వుండాలి. ఓర్పుని మించిన శక్తి మరోటి సృష్టిలో లేదు" వెదుకుతూనే నీలుడ్ని సముదాయించాడు మట్టూ.

"మనిషి కోరుకునేది ఏమిటో తెలుసా అలంబసా, ఒక అద్భుతం తరవాత మరో అద్భుతం జరగాలని. ప్రశాంత గంగలా జీవితం సాగడం మనిషికి ఇష్టం వుండదు. అయితే, అద్భుతాలు జరుగుతై. కేవలం కొన్ని మనిషికి ఆనందాన్నిస్తే నాలుగింట మూడొంతులు మనిషిని భయభీతుడ్ని చేసేవే ఈ భిల్లులకి కూడా కొరుకుడు పడనంత గూఢంగా తయారయిందీ అడవి. అడవి అంటే ఎవరూ? తల్లి. తల్లి బిడ్డలతో దోబూచులాడుతొంది. ఎందుకూ? వర్షాగమనం నెమళ్ళకి తెలుసు. వసంతాగమనం కోయిలలకు తెలుసు. వర్షాగమనం, వసంతాగమనం కోయిలలకు తెలుసు. వర్షా గమనం, వసంతాగమనంలా బీభత్సాగమనమూ కొన్ని జంతువులకి తెలుసు. కాలంలో జరిగే అతి సూక్ష్మమైన మార్పుల్ని కూడా పసిగట్టే శక్తి ప్రకృతిలోని జీవులకి వుంది. మనిషికి మాత్రమే లేదు. ఎందుకంటే మనిషి బుద్ధి అహంకారం చేత పూర్తిగా కప్పబడి వుండటమే" ఆగాడు అరిదమనుడు. అలంబసుడూ సంకల్పానంద మాత్రమే కాదు బ్రహ్మచారులూ, ఇతర భిల్లులూ సేవికలూ కూడా వింటున్నారు.

"అహంకారం నిజాన్ని నిజంగా గుర్తించనివ్వదు. అహంకారం ఓర్పుని కృష్ణ బిలంలా మింగేస్తుంది. శాంతి సహనాలని దగ్గరకే రానివ్వదు. కావాల్సిన కార్యాలన్నీ క్షణాల్లో జరిగిపోవాలని మనసుని తొందరపెడుతుంది. మనశ్శాంతిని దూరం చేస్తుంది. నేను అనుకున్నట్టే అన్నీ జరగాలని పెడబొబ్బలు పెడుతుంది. ఒక్కోసారి మనిషిని పశువుగానూ మారుస్తూంది. అయినా, తనలోని అహాన్ని మనిషి అదుపులో పెట్టుకోడు. 'నేను' అంటే అహమే అనుకుంటాడు. ఆ 'నేను' అనేది శరీరం కాదని విశ్వాత్మలోని ఓ చిన్న అణువనీ ఏనాడూ గుర్తించడు. అందుకే, మనిషిని దుఃఖమూ, చిరాకూ, క్రోధమూ, ద్వేషమూ, అసూయా, మదమూ వంటి అవలక్షణాలు పట్టి పీడిస్తూవుంటాయి. ఈ అజ్ఞానానికీ అహంకారానికీ ఏ యుగంలోనూ అడ్డులేదు. ఒక్కో యుగంలో అజ్ఞానమే మహా జ్ఞానంలా మనిషిని భ్రమింపజేస్తుంది" అన్నాడు అరిదమనుడు.

"అవును అరిదమనా.. ఒక్కో యుగంలో అహంకారమూ అజ్ఞానమే మహాద్భుతమైన విషయాలుగా కనిపిస్తాయి. ఎంతగా అంటే, ఎన్ని వేల మందిని చంపితే అంత శౌర్యవంతుడు. ఎన్ని లక్షలమంది తలనరికితే అంత అరివీర భయంకరుడు. అంటే మనిషి క్రూరత్వానినే వీరత్వమూ శూరత్వమూ అనుకోవాలా? అర్ధ రథులు, అతిరథులు,

మహారథులు చేసిన హింస ఏ శూరత్వానిక్రింద వస్తుంది. సాధారణ సైనికుడి ప్రాణం అంత విలువలేనిదా? ఒక రాజు యొక్క ధనాన్ని, అహం కారాన్నీ ఆడంబరాన్ని కాపాడడానికి లక్షలాది సైనికుల ప్రాణాలు బలిపెట్టాలా? అది కౌరవులు కావచ్చూ, పాండవులూ కావొచ్చు. వారిద్దరూ చేసింది ధ్వంస రచనేగా! అంతేకాదు, ఎన్ని ఏనుగులు, ఎన్ని గుర్రాలు, ఎన్ని ఒంటెలు కురుక్షేత్రంలో ప్రాణాలు బాశాయి అవేం చేశాయసలు? ఏనుగుల తొండాలనీ కాళ్ళనీ నరకడమా? గుర్రాల తలలని నరకడమా? అసలు అది ధర్మక్షేత్రమా? ఎవరికి ధర్మక్షేత్రం? రాజులకా, సామాన్యులకా, నోరులేని మూగజీవులకా? ఎవరికి ధర్మక్షేత్రం. అంతా అయ్యాక, అనంతమైన హింస జరిగాక 'ధర్మం గెలిచింది ' 'ధర్మో రక్షితి రక్షితః' అని పెడబొబ్బలా? ఎవరి ధర్మం గెలిచింది. అసలు ధర్మాన్ని రక్షించిన వాళ్ళు వారిలో ఒక్కరైనా వున్నారా?" ఆవేశంగా అన్నాడు అలంబసుడు.

"నీవన్న ప్రతిమాటా నిజమే. ప్రాణహింస తప్ప అక్కడ జరిగిందేమిటీ? పోనీ గెలిచి బాపుకున్నదేమిటీ? అన్నదమ్ముల మధ్య జరిగిన అనుచిత, అధర్మ సంఘటనలకు మొత్తం మానవజాతికే బాధ్యత వహించమనడం ఏ ధర్మం? కౌరవ పాండవులు మాత్రం గోదాలో దిగి బలాబలాలు తేల్చుకుంటే సరిపోయేదానికి అన్ని దేశాల ప్రజలనీ సైనికులనీ గజ తురగదళాల్నీ మట్టు పెట్టడం ఎందుకూ? నీ ప్రశ్నలు సరైనవే. కానీ అలంబసా, నీ స్వప్నం ప్రకారమో స్మృతి ప్రకారమో ఆనాడు నువ్వూ యుద్ధం చేసే మరణించావు. ఎందుకూ?" అడిగాడు అరిదమనుడు.

"అవును. ఎందుకు యుద్ధం చేసి మరణించానూ, ఈ ప్రశ్న ఇప్పుడు పుట్టింది. అప్పుడు, ఆ యుగంలో ఆ కాలంలో యీ ప్రశ్న పుట్టలేదు. 'చంపు లేక చావు' అనే వీరావేశం నా నెత్తికెక్కింది. మాయాజాలంతో ప్రజలు రక్తాలోడుతుంటే చూసి వికటాట్టహాసాలు చేయించింది. చంపడమే యీ సృష్టికన్నా ఎక్కువ బలిష్టమనే భావన నన్ను అంధుడ్ని చేసింది. నేనొక్కడ్నే కాదు. పాల్గొన్న పద్దెనిమిది అక్షౌహిణీలు సైన్యమూ అదే వివశత్వంలో ఉంది. ఎన్ని తలలు తెంపితే అంత అహం.. ఎంత రక్తాన్ని ప్రవహింపచేస్తే అంత విజయోత్సాహం. అరిదమనా.. ఒక మహా ఉన్మత్తత కురుక్షేత్రాన్ని ఆక్రమించింది. అంధకారపు వెలుగులో అందర్నీ తమని తామే నశింపజేసుకొనేట్టు చేసింది. ఆనాడు నాకు తెలీలా. నన్ను నేనే నాశనం చేసుకుంటున్నానని" అలంబసుడి స్వరంలో ఒక దైన్యం. ఒక నిస్సహాయత, ఒక నిస్పృహ.

"కదూ! ఇప్పుడు మనకున్న పరిస్థితీ అదే అలంబసా. అయితే తీవ్రత అదే అయినా మూలకారణం వేరు అక్కడ, అప్పుడు కృష్ణుడున్నాడు. వ్యక్తిని పక్కనపెట్టి సమూలంగా చెడిపోయిన వ్యవస్థని నిర్మూలించాడు. ప్రకృతి ధర్మాన్ని మాత్రం కాపాడాడు. ప్రకృతిని రక్షించాడు. వ్యవస్త ఎప్పటికప్పుడు మారుతుంది. ఆ వ్యవస్థ ఒక్కోసారి మానవ మనుగడకే నాశకారణమవుతుంది. ప్రకృతీ మార్పు చెందుతుంది, రుతువుల రూపంలో. కానీ ఆ రుతు మార్పులు ప్రకృతిని రక్షించేవేకానీ భక్షించేవి కావు. ఆరు రుతువులూ కాక ఒకే వర్ష రుతువో, ఒకే హేమంత రుతువో, ఒకే శిశిర రుతువో సంవత్సరమంతా వుంటే ఏమవుతుందీ? ఊహలో కూడా మనం ఊహించలేం. అంతేకాదు. ఏ ప్రదేశపు అనుగుణంగా ఆ

మార్పుని ప్రకృతి తనకి తాను సృష్టించుకుంది. అందుకే ధర్మో రక్షిత రక్షితః అన్నారు. ప్రకృతి ధర్మాన్ని రక్షించాలి. మానవ ధర్మాన్ని రక్షించాలి. సృష్టి ధర్మాన్ని రక్షించాలి. సంఘ ధర్మాన్ని రక్షించాలి. అంతేగానీ అహంకారాన్ని కాదు" ఆగాడు అరిదమనుడు. చుట్టూ చేరిన వారంతా వింటున్నారు. ఆ వినే వాళ్ళలో నీలుడూ మట్టూ కూడా వున్నారు.

"అప్పుడు విధ్వంసం జరగకుంటే భూలోకమే ధ్వంసమయ్యేది. అస్త్ర శస్త్రాల ప్రయోగాలలో భూమండలం ఇసుక దిబ్బగా మారేది. ఇంతకీ వాడిన శస్త్రాల సంఖ్య ఎంతో తెలుసునా? అస్త్ర ప్రయోగాల సంఖ్య తెలుసునా? సముద్రంలో ఆలుచిప్పంత. దానికే భూమి ముక్కలుగా విడిపోయింది. కృతయుగంలో భూమి అంతా ఒక్కటిగా గోళాకారంతో ఉంటే, త్రేతాయుగ విధ్వంసానికి మూడు ముక్కలయింది. ద్వాపర విధ్వంసానికి ఏడుముక్కలుగా అనేక వేలాది చిన్న ముక్కలుగా విడిపోయింది. అసలిన్ని దేశాలు ద్వాపరయుగంలో వున్నాయా? భూగోళం నలుమూలలా ఇప్పుడు వెదజల్లబడ్డ ద్వీపాలు ద్వీపాంతరాలు వున్నాయి. ఇప్పుడు, ఈ కలియుగంలో అదే విధ్వంసం జరిగితే? ఊహించగలవా అలంబసా? అప్పటి పాలకులూ ప్రజలూ కొద్దో గొప్పో ప్రకృతి రక్షకులు. ఇప్పుడూ? ప్రకృతి నాశకులు. వీళ్ళ చేతులకి ఆయుధాలు సమకూరిస్తే? ఇప్పటికే మొదటి రెండవ ప్రపంచ యుద్ధాలు చేసిన విధ్వంసాన్ని కళ్ళారా చూశాం. ఓ హిరోషిమా ఓ నాగసాకి మీద అణ్వాయుధాల ప్రభావాన్ని కళ్ళారా చూశాం. ఆనాటికీ యీనాటికీ ఆయుధ సృష్టిలో మనిషి మేధ కోటి రెట్లు పెరిగింది. అణ్వాయుధాలే కాదు రసాయనిక ఆయుధాలు, సూక్ష్మ క్రిముల ఆయుధాలు, శబ్దతరంగాల ఆయుధాలు.. ఓహ్.. అన్నిటి మధ్యా అమాయకపు తల్లిలాంటి భూమాత" సుదీర్ఘంగా నిట్టూర్చాడు అరిదమనుడు.

అందరూ అవాక్కయ్యారు. ఏదో విశ్వశాంతి యజ్ఞంలాంటిదే జరుగుతోందనుకున్నారుగానీ ఇది దేనికి నాందో ఎవరికీ తెలీదు. భూమండలానికి రాబోయే విపత్తు ఎంత దుర్భరమైనదో ఎవరి ఊహకీ అందడంలేదు. అసలు అణ్వస్త్రాలనీ, రసాయన క్రిమి ఆయుధాలనీ మంత్రాలు యాగాలు ఎదుర్కొనగలవా? ఎవరికి దరి అంతుపట్టని యీ కారడవిలో, ఎవరు కట్టారో కూడా తెలియని యీ శిధిలాలయపు ఆవరణలో కొందరు శాంతిస్థాపనకు పూనుకుని చేసే యీ యాగమో, ప్రయత్నమో ఎంతవరకూ ఫలిస్తుందీ? దాదాపు మూడువంతు శ్రోతల్లో ఇదే ప్రశ్న తిరుగాడింది.

"నాకు తెలుసు మీలో కొందరికి యీ యజ్ఞ యాగాల మీదా మంత్ర తంత్రాల మీదా అపారమైన విశ్వాస్వమే కాదు, అంతులేని సందేహాలు కూడా ఉన్నాయని. ఒక మనిషి బుర్రలో ఒకటి అనుకుంటాడు. ఆ అనుకున్నది వెంటనే జరుగుతుంది. అలా పదిసార్లు జరిగినా, ఐదో పదకొండోసారి జరుగుతుందా లేదా అనే సందేహంతోనే వుంటాడు గానీ, యధాతథంగా నమ్మడు. ఇది మనిషి నైజం. మంత్రం శబ్దశక్తికి ప్రతిరూపం. శబ్దానికి మూలం వాయువు. వాయువు లేకపోతే శబ్ద ప్రసారం జరగదు. ఈ వాయువుకి మూలం ఆకాశం. ఆ ఆకాశం లేనిది వాయువులేదు. అంటే పంచభూతాలలో మొట్టమొదటిది ఆకాశం. అంటే సృష్టి జరపడానికి అవకాశం ఇచ్చేది. ఇక్కడ అవకాశం అంటే స్పేస్. అందులోనించి ఉద్భవించింది వాయువు. వాయువు లేక అగ్నీ, జలమూ, పృధ్వీ ఏవీ వుండవు. కనుక సైన్సు ప్రకారం

చూసినా అత్యంత శక్తివంతమైంది వాయువు. మంత్రం శబ్ద రూపం. అంటే ఎంత ప్రచండమైన శక్తిగలదీ! కనుగ నాయనలారా సందేహాలు వద్దు. సముద్రాల లోతుల్ని కొలిచేది సౌండ్. శబ్దం ఒక పరిధి దాటితే మృత్యువు ముందుకి నెట్టగలదు. అలాగే ఒక ప్రత్యేకమైన పద్దతిలో శబ్ద శక్తిని వినియోగిస్తే, అసాధ్యాలను సాధ్యం చెయ్యొచ్చు" అందర్నీ చూసి చక్కగా వివరించాడు అరిదమనుడు.

"ఎలా?" అన్నాడో బ్రహ్మచారి.

"ఒక యజ్ఞం జరిగింది. ప్రళయ వర్షం కురిసింది. కొంత భీభత్సాన్ని చూశావు. నీళ్ళు కాచాలన్నా పాలు కాచాలన్నా ముందు నిప్పు రాజెయ్యాలిగా! అలాగే నిప్పు అనే ఓ మహాద్భుత శక్తి రాజెయ్యబడింది. ఇప్పుడు దాని వెలుగులో మనం ముందుకు సాగాలి. వివరంగా చెప్పాలంటే ఒక జ్యోతిని నీవు వెలిగించగలిగావు. ఆ జ్యోతి ప్రకాశంతో లక్ష జ్యోతుల్ని వెలిగించగలవు. అలాగే యీ యజ్ఞ ఫలితాన్ని విశ్లేషించి తరువాతి కార్యక్రమం నిర్ణయించాలన్నమాట. అర్ధమయిందా!" వివరంగా చెప్పాడు అరిదమనుడు.

"అర్ధమయింది స్వామీ. అయితే, యజ్ఞ ఫలితం మనకి దక్కినట్లేనా?" అడిగాడు ఇంకో బ్రహ్మచారి.

"దక్కింది. దక్కలేదు. మంత్రాలవల్ల కొన్ని సంఘటనలు జరగటం నిర్వివాదాంశం. నివృత్తి యాగం చేస్తే తప్ప పూర్తి ఫలితాన్ని విశ్లేషించలేం" జవాబిచ్చారు సంకల్పానద.

"మరి ఆ యాగాన్నీ పూర్తి చెయ్యొచుగా" అడిగాడు మొదటి బ్రహ్మచారి.

"అందరం వేచి వున్నది అది పూర్తి చెయ్యడానికే. కొన్ని మొక్కల వేళ్ళు, బెరళ్ళు, కొన్ని వృక్షాల ఎండుకొమ్మలు ఇంకాకొన్ని బయటికి చెప్పకూడని దినుసులు తీసుకు రావాలి. అవి లభించకపోవడం వల్లే ఆలస్యం జరుగుతోంది" ఓపిగ్గా జవాబిచ్చారు సంకల్పానంద. దాంతో చర్చ ఆగిపోయింది – అసంపూర్ణంగా.

"నీలా.. మనం చాలా తీవ్రంగా ప్రయత్నించాల్సి వుంటుంది. అరిదమనుల వారి విశ్లేషణ విన్నాక అర్ధమయింది యీ శాంతియాగం ఎంత ముఖ్యమైనదో" అన్నాడు మట్టూ మండపం వైపుకి అడుగులు వేస్తూ.

"అదుగో శృంగి" ఆశ్చర్యంగా అన్నాడు నీలుడు. దూరాన శృంగి. మట్టూకి చెప్పలేని ఆనందం కలిగింది. ఓ విధంగా రామజోగి, మధురలను కలిశాక మట్టుకి శృంగి ఆప్తుడయ్యాడు. మరో విషయం 40రోజులూ శృంగి ఆహార నియమాలు గురువు నిర్దేశించినట్లు పాటించి ఊబకాయాన్ని తగ్గించుకోవడం, గురువాక్కుని వేద వాక్కుగ పాటించడం అంటే భిల్లులకు మహా గౌరవం. ఏభిల్లుడయినా సరే, గురువు అడగాలేగానీ, ప్రాణాన్నైనా క్షణంలో గురువు కోసం ధారపోస్తాడు.

"శృంగీ" ఆప్యాంగా పిలిచాడు మట్టూ.

"మిత్రమా మట్టూ. నాకూ అడవిమీద, ఆలయం మీద ధ్యాస మళ్ళింది. అమ్మవారు నన్ను వాత్సల్యంతో లాగేస్తున్నది. అందుకే గురువుగారికి చెప్పి, వారి అనుమతి తీసుకుని ఇక్కడికి వచ్చా! మట్టూని మొట్టమొదటిసారి కౌగిలించుకుని అన్నాడు శృంగి. నీలుడు నివ్వెరపోయాడు.

"శృంగీ" అన్నాడు కంగారుగా. పకపకా నవ్వాడు శృంగి.

"నీలా.. రా మిత్రమా రా.. కౌగిలించుకుంటే నా బ్రాహ్మణత్వమూ పోదు. నీ భిల్లత్వపు స్వచ్చతా నాకు రాదు. మిత్రులారా రాబోయేది మహా గడ్డుకాలం. దాన్ని ఎదుర్కోవడానికి మనం సంసిద్ధులమై వుండాలి. సైనికుల్లాగా, గురుసేవాతత్పరుల్లాగ, శాంతికాముకుల్లాగా.. విశ్వమానవుల్లాగా" అన్నాడు శృంగి. ఇద్దరి భుజాల మీద తన చేతుల్ని వేసి. ఓ చిరుగాలి తరగ వారు ముర్వుర్నీ ఆపాద మస్తకం చల్లగా తడిమింది. ఆ గాలి తరగ తనతో స్నేహ పరిమళాన్ని కూడా తెచ్చిందా అన్నట్లనిపించింది ఆ ముగ్గురుకీ.

"శ్రీనివాస్" పిలిచింది శరద్వతి.

"నన్నేనా?" నవ్వి అన్నాడు శ్రీనివాస్.

"అవును" తనూ నవ్వింది. వాళ్ళిద్దరూ మాట్లాడుకుని మూడురోజులైంది. శ్రీనివాస్ తాను అనాధననీ విలియమ్స్ తన గతాన్ని చెప్పాడనీ చెప్పి పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పటినించీ శరద్వతి దూరదూరంగా తిరుగుతోంది. భోజనం దగ్గరకు కూడా రావడంలేదు. అది దుర్భరమనిపించినా శ్రీనివాస్ మాట్లాడలేదు. కారణం తను అనాధననీ తల్లిదండ్రులు ఎవరో కూడా తెలీదనీ అతనికి జీర్ణం కానందుకే. అది జీర్ణింప చేసుకోవడమూ అంత సులభం కాదు. తిరుపతి వెళ్ళాక తల్లిని ఏమడగాలి? ఎలా ఫేస్ చెయ్యాలీ? ఆ ఆలోచనలతో శ్రీనివాస్ తన లోకంలో తను వుండిపోయాడు.

"అమ్మయ్య. నన్నే అయితే ఎవరో ఏదో చెప్పారని మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు క్షమించారని భావించవచ్చా?" మనసు కొంచెం తేలిక పడ్డ ధోరణిలో అన్నాడు శ్రీనివాస్.

"మీ మనసులో ఏ తుఫాను వీస్తోందో నేను అర్ధం చేసుకోగలను. అమ్మా నాన్న చుట్టాలు పక్కాలు అందరితోనూ హాయిగా ఉన్నవాడికి హఠాత్తుగా తను అనాధనని తెలిస్తే ఎన్ని సునామీలు మనసుని కబళిస్తున్నాయో నేను ఊహించగలను. నాలాంటి 'పుట్టు ' అనాధల విషయం వేరు" మౌనాన్ని ఆశ్రయించింది శరద్వతి .

"మీరన్నది నిజమే. ఆ నిజం నా మనసుని పురుగులాగా తొలుస్తున్నది నూరుపాళ్ళూ సత్యమే, కానీ శరద్‌జీ, మనసు ఎంత సున్నితమో అంత కఠినం అనుకుంటున్నా. ఎందుకంటే, ఆ ఘాతాన్నీ తట్టుకుని నిలబడిందిగా! దానికంటే ఎక్కువ నన్ను బాధించిన విషయం, మీ ఎదట వివాహ ప్రస్తావన తెచ్చి, మీ మనసుని బాధించానని" సిన్సియర్‌గా అన్నాడు శ్రీనివాస్.

"మీరు నన్ను బాధించలేదు. నాలో ఒక ఆలోచనని ప్రవేశపెట్టారు. అనాథలైనా సనాథలైనా జీవితం గడవాలి గడుస్తుంది. నదిలో కురిసిన వర్షం సముద్రాన్ని చేరడానికే కదా నదిలో కలిసిపోయి పయినించేదీ. ఎప్పుడో అప్పుడు ఎవరినో ఒకరిని నేనూ పెళ్ళి చేసుకోవాలి. ఎందుకూ అంటే సమాధానం రెడిగానే వుంది. 'తోడు' అనేది ఎంత అద్భుతమో అపురూపమో తెలిసింది అనాథలకే. అదీ, 'నా సొంతం' అనుకునే తోడు. మీరు మేరేజ్ ప్రపోజల్ తేగానే మొదట ఆశ్చర్యపోయా. మీ అమ్మగారు కనకపోయినా మీ అమ్మే. కన్నతల్లి కంటే కోటి రెట్లు గొప్పవారు. ఏనాడూ మీరు అనాథ అని మీకు తెలియకుండా పెంచిన తల్లి ఎంత గొప్పదీ. ఇక నేను మీకు తగుతానా? మరో విషయం కమ్యూనికేషన్. మనం ఇంగ్లీషులో మాట్లాడుకుంటున్నాము. పెళ్ళయ్యాక మీ అమ్మగారితో ఏ భాష మాట్లాడనూ. మన ఆహారపుటలవాట్లు వేరు గృహ ధర్మాలు ఏమి తెలుస్తాయీ. ఇలాంటివే లక్ష ఆలోచనలు నన్ను నిద్రపోనివ్వలా. మీ ఎదట పడటానికి నన్ను నేను సిద్ధం చేసుకోలేకపోయాను" తలవంచుకుని అన్నది శరద్వతి.

శ్రీనివాస్ మౌనంగా వింటున్నాడు.

"మరో విస్మరించలేని విషయం. విలియమ్స్ మాటల సారాంశం మనిద్దరికీ కల్యాణం జరిగితీరాలని. ఒక ఆత్మ అంతగా ఎందుకు పట్టుబడుతోందీ? జవాబూ అతనే ఇచ్చాడు. మనిద్దరికీ పుట్టబోయే బిడ్డ మహాశక్తి శాలి అవుతాడని. అంటే ఆ బిడ్డ ఒక కార్యం నెరవేర్చడానికి ప్రత్యేకంగా నిర్దేశింప బిడ్డ అయివుండాలి" మళ్ళీ ఆగింది శరదృతి. కొంత సేపు మౌనం నాట్యం చేసింది.

"అసలు నిన్ను ఇంత దూరం ఆ డ్రైవర్ శరీరంలో దూరి తెవడానికి వెనుక చాలా చాలా రిసెర్చే జరిగివుండాలి. లేకపోతే నిన్నే వింధ్య పర్వత శ్రేణుల దగ్గరికి ఎందుకు తెస్తాడు? వింధ్య పర్వత డ్రేణుల దగ్గరికి ఎందుకు తెస్తాడు? మా బాస్ అనూపవతి భర్త 22 లక్షలు ఎందుకు మీకూ నాకూ, అంటే మనకి ఇమ్మంటాడు? అన్నీ ప్రశ్నలైనా అన్ని ప్రశ్నల గమ్యమూ వివాహమే."

కుర్చీలో అటూ ఇటూ కదిలాడు శ్రీనివాస్.

"ఇవన్నీ నేనూ ఆలోచించిచను శరద్వతీ. నాకు ఒక్కటే అనిపిస్తోంది. జరుగుతున్నదంతా మానవాళి మేలుకేనని అంత మటుకు ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు శ్రీనివాస్.

"ఒక అనాథని నీ భార్యగా చేసుకోగలవా?" తలెత్తి సూటిగా శ్రీనివాస్ వంక చూసి అన్నది శరద్వతి. శ్రీనివాస్ సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. రెండు నిర్మల కళార పుష్పాల్లా వున్నాయి ఆమె కళ్ళు. ఓ క్షణం ఆ కళ్ళల్లోకి చూస్తూ పదహారు జన్మలు గడిపెయ్యొచ్చు" తనలో తను అనుకున్నాడు.

"ఆ మాట అడగాల్సింది నేను శరద్వతీ. మీరు నన్ను పెళ్ళి చేసుకుంటే ఇద్దరమూ అనాథలము కాము. ఆ అధ్యాయం తక్షణమే ముగుస్తుంది" ఆమె కళ్ళలోకి చూస్తూనే అన్నాడు.

"మనసా వాచా కర్మణా. నేను సిద్ధం మీకేనాడూ ఎటువంటి ఇబ్బందీ కలిగించను" స్థిరంగా చెప్పింది శరద్వతి. శ్రీనివాస్ చేతులు రెండూ తన చేతుల్లోకి తీసుకుంది శరద్వతి. శ్రీనివాస్ ఆమె చేతులు రెండు తన చేతుల్లోకి తీసుకుని "ఇదే పాణిగ్రహణం శరద్వతీ. పెళ్ళి మా అమ్మా, మరో అమ్మ సమక్షంలోనే జరుగుతుంది. మరుక్షణం ఆమె నీకూ అమ్మగానే ఉంటూంది. ఇంగ్లీషులో మదర్ – ఇన్ –లా " నవ్వి అన్నాడు శ్రీనివాస్.

పురుషుడు ముందు స్త్రీని కౌగిలించుకోవాలని తొందరపడతాడు. కానీ, మెల్లగా లేచి నిలబడ్డ శరద్వతి అతన్నీ కుర్చీలోనించి లేపి సన్నజాజి తీవెలా అల్లుకుపోయింది. ఆ కౌగిలింతలో వున్నది అనంతకాలం నించీ ప్రవహిస్తున్న అనిర్వచనీయమైన స్నేహమాధుర్యం

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments